క్లుప్తంగా

డీమైలినేషన్ డిజార్డర్‌కు చికిత్స

కర్నూలు(హాస్పిటల్): మెదడులో ప్రొటీన్లు కరిగి ఇబ్బందులు పడుతున్న ముగ్గురు చిన్నారులకు కర్నూలులోని కిమ్స్ కడల్స్ హాస్పిటల్స్ వైద్యులు సత్వర చికిత్స అందించి ప్రాణం పోశారు. వివరాలను పీడియాట్రిక్ న్యూరాలజిస్టు డాక్టర్ శ్వేత రాంపల్లి శుక్రవారం వివరించారు. ఆదోని ప్రాంతానికి చెందిన రెండేళ్ల పాప, అనంతపురం జిల్లా తాడిపత్రికి చెందిన ఐదేళ్ల బాబు, కర్నూలు జిల్లాకు చెందిన 10 ఏళ్ల బాలుడు జ్వరం, వాంతులు, కాళ్లు చేతులు కదిలించలేకపోవడం వంటి లక్షణాలతో ఆసుపత్రికి వచ్చారు. ముగ్గురినీ ఐసీయూలో చేర్చుకుని పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో లక్షణాలను బట్టి చికిత్స అందించాం. పరీక్షల ఫలితాలను బట్టి ఈ ముగ్గురికీ డీమైలినేషన్ డిజార్డర్, న్యూరోమైలిటీస్ ఆప్టికా స్పెక్ట్రమ్ డిజార్డర్ అనే సమస్య వచ్చినట్లు గుర్తించాం. ఆ మేరకు చికిత్స అందించగా ముగ్గురికీ లక్షణాలు క్రమంగా తగ్గాయి. మరికొంత కాలం ఇమ్యునోసప్రెసివ్ మందులు వాడాలని సూచించి డిశ్చార్జ్ చేశాం. కొన్నివారాలు, నెలల చికిత్స అనంతరం ముగ్గురూ కోలుకున్నారని వివరించారు.

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం



తిప్పతీగ అల్లుకుని ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాన్ని చూపుతున్న సీపీఎం నేతలు

కర్నూలు(సెంట్రల్): ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న విద్యుత్ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని 43వ వార్డు పరిధిలోని రెవెన్యూ కాలనీలో కరెంట్ స్తంభానికి తిప్పతీగ చుట్టుకొని ప్రమాదకరంగా మారిందని, దానిని తొలగించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తుండడంతో ప్రజల ప్రాణాల మీదకు వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు ఏడాదిగా తీగ పెరుగుతున్నా తొలగించుకుండా విద్యుత్ శాఖాధికారులు చోద్యం చూస్తున్నారన్నారని విమర్శించారు. స్థానిక నాయకులు వి.శంకర్,ఎం.భాస్కర్, రోశయ్య, మద్దిలేటి, బీసన్న పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీకి మెమో

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.హరిప్రసాద్‌రెడ్డి, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ హెచ్‌ఓడీ సతీష్‌కుమార్, సీఎస్‌ఈ ఫ్యాకల్టీ శ్వేత ప్రియకు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు మెమో జారీ చేశారు. సీఎస్‌ఈ ఫ్యాకల్టీ శ్వేత ప్రియ అనుమతి లేకుండా కాలేజీకి హాజరు కాకపోవడంతో మెమో ఇచ్చారు. తరగతులు రెగ్యులర్‌గా జరిగేలా పర్యవేక్షణ చేయకపోవడం, ఇంజినీరింగ్ విద్యార్థుల హాజరు శాతం తక్కువ ఉండటంతో సీఎస్‌ఈ హెచ్‌ఓడీ సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ హరిప్రసాద్ రెడ్డి నుంచి వివరణ కోరినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఈ నెల 3వ తేదీన వర్సిటీ వీసీ ఆచార్య ఎన్‌టీకే నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేయగా ఈ విషయాలు వెలుగు చూశాయని, ఆయన ఆదేశాల మేరకు మెమో జారీ చేసినట్లు రిజిస్ట్రార్ చెప్పారు.

పండగొస్తే పద్మవ్యూహమే !

- కర్నూలు నగరంలో ట్రాఫిక్‌తో నరకం
- హడలిపోయేలా బళ్లారి చౌరస్తా, సి.క్యాంప్ సెంటర్
- ఎటువెళ్లినా ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకోవాల్సిందే





మద్దూర్ నగర్‌లో స్తంభించిన ట్రాఫిక్



కిక్కిరిసిన పెద్దమార్కెట్ ప్రాంతం

కర్నూలు: నగరవాసులను నిత్యం వేధించే సమస్యలో ట్రాఫిక్ రద్దీ కూడా చేరింది. ఐదేళ్లలో పెరిగిన వాహనాల సంఖ్యకు అనుగుణంగా నగర రహదారులు విస్తరణకు నోచుకోలేదు. ఉన్న దారుల్లోనే వాహనాల రద్దీ అమితంగా పెరిగిపోయింది. ముఖ్యంగా వ్యాపార, వాణిజ్య సముదాయాలు కలిగిన రహదారుల్లో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో యథేచ్ఛగా రహదారులను ఆక్రమించి వ్యాపారాలను సాగిస్తున్నారు. సెట్‌బ్యాక్ లేకుండా నిర్మాణాలు జరపడంతో నగర ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పండుగ రోజుల్లో వాహనాలు నిలిపేందుకు చోటు లేకపోగా నిబంధనలు పాటించడం లేదంటూ పోలీసులు సామాన్యులపై చలానాలు విధిస్తున్నారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని కొనుగోలుదారులతో పాతబస్తీతో పాటు ప్రధాన రహదారుల్లో వ్యాపార సముదాయాలు కిటకిటలాడాయి. దీంతో వాహనదారుల రాకపోకలకు సమస్య తలెత్తి గంటల తరబడి రోడ్లపైనే నరకయాతన అనుభవించారు. దీనికి తోడు వినాయక విగ్రహాలను మండపాల వద్దకు తరలిస్తుండడంతో ప్రధాన రహదారుల్లో కూడా మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. వినాయక చవితితో పాటు వరుసగా దసరా, దీపావళి పండుగలు ఉన్నందున ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టకపోవడం వల్ల సమస్య జటిలమయ్యింది. నంద్యాల చెక్‌పోస్టు నుంచి రాజ్‌విహార్ వరకు పాతబస్తీ నుంచి బళ్లారి చౌరస్తా వరకు వ్యాపార సముదాయాలు ఉన్నాయి.

పార్కింగ్‌కు స్థలాలు లేక ఇక్కట్లు

తొలి పండుగ, ఆది దేవుడి ఉత్సవాల వేళ కర్నూలు పాతబస్తీతో పాటు ప్రధాన రహదారుల్లో వ్యాపార సముదాయాలకు సరైన పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలు నిలుపుతున్నారు. దుకాణాదారులు వస్తువులు రోడ్డుకు ఆనుకుని, మున్సిపల్ కాలువలపై కూడా సామగ్రి ఉంచి వ్యాపారాలు సాగిస్తుండటంతో అటుగా కార్లు, ఆటోలు, ట్రాలీ బండ్లు, ట్రాక్టర్లు, స్కూల్ బస్సులు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పూలు, పండ్లు, చిన్నపాటి గణేష్ విగ్రహాలు, మామిడి, అరటి ఆకులు రోడ్లపైనే ఉంచి వ్యాపారాలు సాగించారు. కొనుగోలుదారులు ఆయా దుకాణాల వద్ద రోడ్లపైనే వాహనాలు నిలిపినా వ్యాపారులు పట్టనట్లు వ్యవహరించడంతో ట్రాఫిక్ రద్దీ పెరిగి రాకపోకలకు ఉదయం నుంచి రాత్రి వరకు గంటల కొద్దీ అంతరాయం ఏర్పడింది.

రోడ్లపైనే చిరు వ్యాపారులు

కొనుగోలుదారులు, వాహనదారులతో నిత్యం రద్దీగా ఉండే పాతబస్తీ రహదారుల్లో పార్కింగ్ సమస్య తీవ్రమయ్యింది. కనీసం నడవడానికి కూడా వీలు లేని పరిస్థితి తలెత్తింది. ఇరుకు దారుల్లో ఏ వాహనం ఎటువైపు నుంచి వస్తుందో తెలుసుకోవడం కష్టంగా ఉంటుంది. అలాగే బళ్లారి చౌరస్తాలో కూడా నిత్యం ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు సతమతమవుతున్నారు. ఏ క్షణంలో రోడ్డుపై రద్దీ పెరుగుతుందో అంచనా వేయలేని పరిస్థితి. ప్రధాన రోడ్డుకు లింకు రోడ్లు అనేకం. ఆయా రోడ్ల నుంచి ప్రధాన రహదారిపైకి వచ్చేలోగా వాహనాల రద్దీ పెరుగుతుండటంతో నిత్యం గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. పండుగ రద్దీతో ఉదయం నుంచి రాత్రి వరకు బళ్లారి చౌరస్తా నుంచి కొత్తబస్టాండ్ వరకు వాహనదారులు రోజంతా నరకయాతన అనుభవించారు. నాలుగు వైపుల నుంచి దూసుకొచ్చే వాహనాలతో అనుక్షణం ట్రాఫిక్ సమస్యలు సాధారణ రోజుల్లో కూడా ఉత్పన్నమవుతున్నాయి.

కొందరు వ్యాపారుల జులుం...

పాతబస్తీలోని పూలబజార్‌లో పండుగ రోజుల్లో నడవడానికి కూడా సాధ్యం కాని పరిస్థితులు నెలకొంటున్నాయి. రోడ్లపై కొంతమంది విక్రేతలు వాహనదారులపై జులుం ప్రదర్శిస్తున్నారు. పూలు, పండ్లు, ఇతర పూజా సామగ్రి విక్రయించేవారు రోడ్డుపైకి వచ్చినప్పటికీ ట్రాఫిక్ పోలీసులు అడ్డు చెప్పకపోవడం గమనార్హం. వ్యాపారుల నోటి దురుసుకు వాహనదారులతో పాటు కొనుగోలుదారులు కూడా భయపడాల్సిన పరిస్థితులు తరచూ తలెత్తుతుంటాయి. పాతబస్తీలో వ్యాపారుల అజమాయిషీ సాధారణ రోజుల్లో కూడా నడుస్తోంది. పండుగ రోజుల్లోనైనా వాహనాల రద్దీ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు. వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి చేపల మార్కెట్ వరకు రోడ్డుపై తోపుడుబండ్లు, చిరు వ్యాపారులు కమ్మేయడం, ఆటోలు, ఇతర వాహనదారులు అక్కడే పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ సమస్య పండుగ రోజుల్లో మరింత జటిలంగా మారుతోంది. దుకాణాదారుల ఆక్రమణలతో రోడ్డు ఇరుకుగా మారి వ్యాపారుల మధ్య తరచూ గొడవలు కూడా జరుగుతున్నప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. నగరంలో ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించేందుకు జిల్లా మంత్రి దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బందులు కలగకుండా చర్యలు

సాధారణ రోజుల కంటే పండుగ రోజుల్లో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. వాహనాల రాకపోకలకు ఇబ్బంది తలెత్తిన మాట వాస్తవమే. పాతబస్తీతో పాటు వ్యాపార సముదాయాల వద్ద పండుగ సామగ్రి కొనుగోలుదారుల కారణంగా రద్దీ పెరిగింది. ఇకపై రద్దీ ఏర్పడకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

–మన్సురుద్దీన్, ట్రాఫిక్ సీఐ

వినాయక చవితి సందడి

విఘ్నాధిపతి వినాయకుడి పండుగను ఘనంగా జరుపుకునేందుకు నగర ప్రజలు సిద్ధమయ్యారు. తమ ఇళ్లల్లో వినాయక ప్రతిమను ఉంచి పూజలు నిర్వహించేందుకు అరటి గెలలు, మామిడాకులు, గరిక, ఐదు రకాల పత్రులు, పూలు, పండ్లు, పండుగ సరుకులు కొనుగోలు చేస్తుండడంతో శుక్రవారం నగరమంతా పండుగ వాతావరణంతో సందడి నెలకొంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



మద్దూరు నగర్‌లో వినాయక ప్రతిమల విక్రయం



స్వామి విగ్రహం ఎంత బాగుందో..



కొండారెడ్డి బురుజు వద్ద పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న ప్రజలు



జెడ్పీ కార్యాలయం ముందు పూలమాలల విక్రయం



సి.క్యాంప్ వద్ద పూజా సామగ్రి విక్రయిస్తున్న వ్యాపారులు

వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన నేతలు

కర్నూలు (టౌన్): నంద్యాల, కర్నూలు జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు అని వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి, కాటసాని రాంభూపాల్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరికీ వినాయకుడి శుభాలు కలగాలని ఆకాంక్షించారు. మూడేళ్ల పాటు బక్రీదు, వినాయకచవితి పండుగలు ఒకేసారి వచ్చినా ప్రజలందరూ మతసామరస్యం పాటిస్తూ శాంతియుత వాతవరణంలో వేడుకలు జరుపుకున్నారని గుర్తు చేశారు. జిల్లాకు మంచి సంప్రదాయం ఉందని, 9 రోజులు వినాయకుడికి ఘనంగా పూజలు నిర్వహించి కులాలకు, మతాలకు అతీతంగా ఉత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విజయాలు సిద్ధించాలి

కర్నూలు(సెంట్రల్): వినాయకుడి ఆశీస్సులతో ప్రజలకు మంచి జరగాలని కోరుకుంటున్నట్లు మంత్రి టీజీ భరత్, కలెక్టర్ పి.రంజిత్‌బాషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి పనిలో విజయం చేకూరేలా వినాయకుడు విఘ్నాలను తొలగించాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించాలని పిలుపునిచ్చారు.

పందులను రోడ్లపైకి వదిలితే కేసులు

కర్నూలు (టౌన్): నగరంలో పందులు రోడ్లపై కనిపిస్తే సంబంధిత యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటన ద్వారా హెచ్చరించారు. వివిధ ప్రాంతాల్లో రోడ్లపై పందులు యథేచ్ఛగా తిరుగుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, మార్కెట్ల వద్ద పందులు సంచరిస్తూ ప్రజారోగ్యానికి హాని కలిగిస్తున్నాయని వివరించారు. పందులను నగరం నుంచి 5 కిలోమీటర్ల దూరంలో పెంచుకోవాలని సూచించారు. ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే విధంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరద బాధితులకు చేయూతనివ్వాలి

కర్నూలు(సెంట్రల్): విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా కోరారు. శుక్రవారం తన చాంబరులో ముఖ్యమంత్రి సహాయనిధికి మహోదయ సొసైటీ సభ్యులు శ్రీనివాస్, శేషాద్రి, బి.సాయిదీపక్, రంగప్ప రూ.20 వేల చెక్కును ఇచ్చారు. ఆపదలో ఉన్న వారికి చేయూతనివ్వాలని ప్రజలను కోరారు.

ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల కోసం రూ.27,800 విరాళాలను ప్రజల నుంచి సేకరించారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, రాగవేంద్ర ఆధ్వర్యంలో విరాళాలను సేకరించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో పనిచేస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ క్లాప్ డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నగర కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో 52 వార్డుల్లో చెత్త సేకరిస్తున్న వారికి వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేయడం తగదన్నారు. ఆ సంఘం నాయకులు విజయ రామాంజనేయులు, మహమూద్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు జాగ్రత్తలు పాటించాలి



తొట్టిలో నిల్వ నీటిని పారబోస్తున్న డెమో శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): అధికంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు చెప్పారు. శుక్రవారం స్థానిక షరీన్‌నగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని విఠల్‌నగర్‌లో ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పరిసరాల శుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో దోమలు కుట్టడం ద్వారా మలేరియా, డెంగీ, మెదడువాపు, ఫైలేరియా వ్యాధులు వస్తాయన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే వాటిని నివారించవచ్చని చెప్పారు. నీటి తొట్లు, ఇతర పాత్రలు మూసి ఉంచాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే దుస్తులు ధరించాలని, వారానికి ఒకసారి నీటి తొట్టెలను ఇతర పాత్రలను శుభ్రంగా కడిగి తుడిచి మళ్లీ నింపుకోవాలని సూచించారు. దోమతెరలను తప్పనిసరిగా వాడాలని, సాయంత్రం ఐదు గంటల తర్వాత ఇంటి తలుపులు, కిటికీలు మూసి ఉంచాలన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య బోధకులు పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఉయ్యాలవాడలో సోలార్ ప్లాంట్ వద్దు’



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న రైతుసంఘాలు

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్ మండలం ఉయ్యాలవాడలో సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తామని రైతు సంఘాలు హెచ్చరించాయి. శుక్రవారం కలెక్టరేట్ ఎదుట రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకరరెడ్డి, ఆ సంఘం గౌరవాధ్యక్షుడు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ.. ఉయ్యాలవాడలో సోలార్ ప్లాంటు వద్దని గ్రామ పంచాయతీ ముక్తకంఠంతో తీర్మానం చేసిందన్నారు. అయినా రెవెన్యూ, సర్వే అధికారులు రైతుల అనుమతి లేకుండా పొలాలను సర్వే చేయడం దారుణమన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో టీడీపీనాయకులు సోలార్ ప్లాంటు వద్దని వినతులు ఇచ్చారని, ఇప్పుడు నోరు మెదపకుండా ఉండడం అన్యాయమన్నారు. 20 రోజుల్లోపు సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోమని ప్రకటన చేయకపోతే కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నాయకులు జగన్నాథం, నాగన్న, రమేష్, మధుసూదన్, రైతులు పాల్గొన్నారు.

హంద్రీ ఆక్రమణలను తొలగించాలి

కర్నూలు(న్యూసిటీ): హంద్రీనది ఆక్రమణలతో కర్నూలు నగరానికి వరద ముప్పు పొంచిఉందని రాయలసీమ యువజన విద్యార్థి సంఘాల నాయకులు వీవీ నాయుడు, కురువ సుంకన్న, రంగముని, కృష్ణానాయక్ స్పష్టం చేశారు. వారు శుక్రవారం హంద్రీనది ఆక్రమణలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. విజయవాడలో వరదలకు లక్షల మంది పేదలు నిలువ నీడలేకుండా నష్టపోయారన్నారు. ఇలాంటి పరిస్థితి కర్నూలు నగరానికి రాకుండా హంద్రీ నదిలో ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు.